



పొగాకు పంటపై బోర్డు ఉక్కుపాదం

- సాగు మొదలుకాకముందే కట్టడి
- మార్కెట్ సంక్షోభం పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు
- 43 శాతం కోతతో 81 మిలియన్ కిలోలకే అనుమతి
- నారుమడి నుంచే సాగు నియంత్రణకు శ్రీకారం
- వచ్చే సీజన్‌కు నారుమడులు పోసే సమయం
- రానున్న సీజన్‌ను క్రమబద్ధీకరించేందుకు బహుళస్థాయి చర్యలకు శ్రీకారం

అమరావతి, ఆంధ్రప్రభ: ఈ సీజన్‌లో పొగాకు మార్కెట్‌ను కుదిపేసిన సంక్షోభం వచ్చే ఏడాది పునరావృతం కాకుండా పొగాకు బోర్డు ఇప్పటినుంచే రంగంలోకి దిగింది. పంట చేతికొచ్చాక ఉత్పత్తిని నియంత్రించడం కష్టమన్న అనుభవంతో, నారుమడి దశ నుంచే సాగుపై నిఘా పెట్టాలని బోర్డు నిర్ణయించింది. అనుమతించిన పరిమితికి మించి సాగు, అధిక ఉత్పత్తి, నాణ్యతలో లోపాలు, వేలం ప్రక్రియలో జాప్యం వంటి అంశాలు మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపిన నేపథ్యంలో రానున్న సీజన్‌కు పకడ్బందీ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ప్రధానంగా పంట సాగు విస్తీర్ణం-ఉత్పత్తి నియంత్రణ, నాణ్యత పెంపు, వీలైనంత వేగంగా వేలం ప్రక్రియ పూర్తి అనే లక్ష్యాలతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుతం కొనసాగుతున్న 2025-26 పొగాకు సీజన్‌లో రాష్ట్రానికి 142 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, వాస్తవంగా సుమారు 256 మిలియన్ కిలోల వరకు పంట ఉత్పత్తి అయినట్లు అంచనా.

అనుమతించిన పరిమితిని భారీగా దాటి ఉత్పత్తి కావడమే మార్కెట్ ప్రతికూల పరిస్థితులకు ప్రధాన కారణాల్లో ఒకటిగా బోర్డు గుర్తించింది. అధిక సరఫరి కారణంగా కొనుగోళ్లపై ఒత్తిడి పెరగడం, వేలం ప్రక్రియ సుదీర్ఘంగా సాగడం వంటి పరిణామాలు రైతులను ఆందోళనకు గురి చేశాయి. ఈ నేపథ్యంలో రానున్న సీజన్‌లో ఉత్పత్తిపై బోర్డు భారీ కోత విధించింది. ప్రస్తుతం అంచనా ఉత్పత్తితో పోలిస్తే దాదాపు 43 శాతం తగ్గిస్తూ కేవలం 81 మిలియన్ కిలోల ఉత్పత్తికే అనుమతి ఇచ్చింది.

అయితే, కాగితాలపై ఉత్పత్తి పరిమితి విధించడం ఒక ఎత్తైతే, క్షేత్రస్థాయిలో రైతులు ఆ పరిమితిలోనే సాగు చేసేలా చూడటం మరో పెద్ద సవాలుగా మారింది.

నారుమడి నుంచే నియంత్రణకు కొత్త వ్యూహం

వచ్చే సీజన్‌కు నారుమడులు పోసే సమయం సమీపిస్తుండటంతో బోర్డు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. బోర్డు అనుమతి లేకుండా నారుమడులు ఏర్పాటు చేయరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నారు. నారుమడి స్థాయి నుంచే సాగు విస్తీర్ణాన్ని గుర్తించి, అనుమతించిన పరిమితికి మించి పంట విస్తరించకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.అలాగే నాణ్యమైన పంట ఉత్పత్తి లక్ష్యంగా విత్తనాల వినియోగంపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. నాణ్యమైన నారు కోసం గుర్తింపు పొందిన పరిశోధనా సంస్థలు లేదా అనుమతించిన విత్తన వనరుల నుంచే విత్తనాలను పొందాలని, అదీ బోర్డు అనుమతి, పర్యవేక్షణతోనే సాగు ప్రక్రియ చేపట్టాలని రైతులకు స్పష్టం చేయనున్నారు. నాసిరకం విత్తనాలు, నాణ్యత లేని నారు కారణంగా పంట నాణ్యత దెబ్బతినకుండా మొదటి దశ నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

రైతు కమిటీలతో తొలి దశ సమావేశాలు

ఈ కొత్త విధానంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించేందుకు బోర్డు ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. ప్రస్తుతం వివిధ వేలం కేంద్రాల పరిధిలోని రైతు కమిటీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. బోర్డు ప్రధాన కార్యాలయం స్థాయిలో విస్తరణ విభాగం, ప్రాంతీయ మేనేజర్లు సమన్వయంతో సాగు విస్తీర్ణం నియంత్రణ, ఉత్పత్తి తగ్గింపు, నాణ్యత పెంపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నారు. బోర్డు నిర్దేశించిన ఉత్పత్తి పరిమితిని ఎందుకు పాటించాలి..

అధికోత్పత్తి వల్ల రైతులకే ఎలాంటి నష్టం జరుగుతుంది..నాణ్యమైన పంటకు మార్కెట్‌లో ఎలాంటి ప్రాధాన్యం ఉంటుంది.. వంటి అంశాలను రైతు ప్రతినిధులకు వివరించి, వారిద్వారా గ్రామ స్థాయికి సమాచారం చేరేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. తొలి దశ సమావేశాల అనంతరం పొగాకు అధికంగా సాగయ్యే గ్రామాల్లో నేరుగా రైతులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు బోర్డు సిద్ధమవుతోంది. ప్రతి ప్రాంతంలో సాగు పరిస్థితులు, నారుమడుల సంఖ్య, ప్రతిపాదిత సాగు విస్తీర్ణం వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసే నారుమడులు, అనధికారికంగా విస్తరించే పంట సాగుపై కఠినంగా వ్యవహరించాలన్న ఆలోచనలో బోర్డు ఉన్నట్లు సమాచారం. నారుమడి దశలోనే నియంత్రణ అమలు చేయడం ద్వారా తర్వాత భారీగా పెరిగే పంట విస్తీర్ణాన్ని అరికట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.

పరిమాణం కాదు... నాణ్యతే లక్ష్యం

రానున్న సీజన్‌లో బోర్డు వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. ఎక్కువ పండించడం కాదు... మార్కెట్‌కు అవసరమైన మేరకే, అత్యుత్తమ నాణ్యతతో పండించాలన్నదే ప్రధాన లక్ష్యం. అధికోత్పత్తి జరిగితే ధరలు పడిపోవడం, కొనుగోళ్లు మందగించడం, వేలం ప్రక్రియ ఎక్కువ రోజులు కొనసాగడం వంటి సమస్యలు తలెత్తుతాయని రైతులకు వివరించ నున్నారు. పంట ఉత్పత్తిని డిమాండ్‌కు అనుగుణంగా నియంత్రించడం, నాణ్యతను మెరుగుపరచడం ద్వారా కొనుగోలు దారులకు మెరుగైన సరఫరా అందించడంతోపాటు రైతులకు స్థిరమైన మార్కెట్ ఏర్పడే అవకాశం ఉంటుందని బోర్డు వర్గాలు భావిస్తున్నాయి. సాగు నియంత్రణతోపాటు వచ్చే సీజన్‌లో వేలం ప్రక్రియను వీలైనంత వేగంగా పూర్తి చేయడం కూడా బోర్డు ముందున్న ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. ఉత్పత్తి అంచనాలను ముందుగానే కట్టడి చేసి, నాణ్యమైన పంటను మార్కెట్‌కు తీసుకురావడం ద్వారా వేలం కేంద్రాలపై అనవసర ఒత్తిడి తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు అవసరమైన కార్యాచరణపై కూడా సమాలోచనలు జరుగుతున్నాయి.



రాజధానిలో రూ.214 కోట్లతో ఎస్‌బీఐ ఉద్యోగుల నివాస సముదాయం

- 2028 నాటికి భవన నిర్మాణాలు పూర్తి
- పూర్తి అయిన భూ అగ్రిమెంట్

అమరావతి, ఆంధ్రప్రభ: రాజధాని అమరావతిలో రూ.214 కోట్లతో 4.46 లక్షల చదరపు అడుగుల బిల్ట్‌ అప్‌ ఏరియాతో ఎస్‌బీఐ ఉద్యోగుల నివాస సముదాయాన్ని నిర్మించనున్నారు. ఆమేరకు శుక్రవారం దీనికి సంబంధించిన భూ అగ్రిమెంట్‌ సీఆర్‌డీఏ, ఎస్‌బీఐ మధ్య పూర్తయ్యింది. ఈ మేరకు సంబంధిత పత్రాలను సీఆర్‌డీఏ ఎస్టేట్స్‌ విభాగ జాయింట్‌ డైరెక్టర్‌ జుబిన్‌ రాయ్‌, ఎస్‌బీఐ ఏజీఎం జి.రామకృష్ణకు సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయంలో అందజేశారు.రాజధాని అమరావతిలోఎస్‌బీఐ తన ప్రాంతీయ కార్యాలయాన్ని లింగాయ పాలెం, ఉద్దండ రాయునిపాలెం పరిధిలో 3 ఎకరాలలో రూ.250 కోట్ల వ్యయం తో నిర్మిస్తోంది. కార్యాలయ నిర్మాణ పనులకు కేంద్రమంత్రి నిర్మల సీతారామన్‌ గతేడాది నవం బర్‌లో శంకుస్థాపన చేశారు. ఈ మేరకు అమరావతిలోని ఎస్‌బీఐ సిబ్బంది నివసిం చేందుకు వీలుగా అమరావతిలోని ఐనవోలులో 2.05 ఎకరాలలో ఎస్‌బీఐ నివాస గృహాలను నిర్మించనుంది. దీనికై సీఆర్‌డీఏ, ఎస్‌బీఐ తో తాజాగా అగ్రిమెంట్‌ కుదు ర్చుకుంది. ప్రజారాజధాని అమరావతిని జాతీయ స్థాయిలో ఆర్థిక, పరిపాలనా కేంద్రంగా బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చే కార్యాచరణలో, ఈ అగ్రిమెంటు తో కీలకమైన ముందడుగు పడింది. జూన్‌ 2027లో పనులు ప్రారంభించి 2028 లోపు నివాస సముదాయాలను పూర్తి చేస్తామని ఎస్‌బీఐ అధికారులు తెలిపారు.

ఇమ్మర్సివ్ డ్రైవ్‌లో విజయవాడ జోన్ రైల్వే డీజిల్ లోకో షెడ్ బెస్ట్

- ఇమ్మర్సివ్ డ్రైవ్‌లో విజయవాడ జోన్ రైల్వే డీజిల్ లోకో షెడ్ బెస్ట్
- ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ తపన్ కుమార్ సిన్హా వెల్లడి

అమరావతి, ఆంధ్రప్రభ : రైల్వేలో డీజిల్ లోకో షెడ్‌లో విజయవాడ డివిజన్ అమలు చేస్తున్న. విధానాలు నాణ్యతా ప్రమాణాలకు తగ్గట్లుగా ఉన్నాయని దక్షిణ కోస్తారైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ తపన్ కుమార్ సిన్హా అన్నారు. శుక్రవారం విజయవాడ రైల్వే బోర్డు చేపట్టిన ఇమ్మర్సివ్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొని ఆయన పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు..ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల కోసం ఎయిర్ కంప్రెసర్, సిసిబి బెస్ట్ బెంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కొత్త విధానం వల్లషెడ్‌లో పరీక్షల నిర్వహణ సామర్థ్యాలు మరింత బలోపేతం అవుతాయని చెప్పారు. విజయవాడ డీజిల్ లోకో షెడ్‌ను పూర్తిగా తనిఖీ చేశారు. డీజిల్ లోకో షెడ్‌లో , టవర్ కార్లలో ఉపయోగించే లోడ్ కంట్రోల్ కన్సోల్ కార్డులను మరమ్మతు చేస్తున్న భారతీయ రైల్వేల్లోని ఏకైక షెడ్ విజయవాడ ఒక్కటే అని ఆయన ప్రశంసించారు. దీంతో అంతర్గత మరమ్మతు సామర్థం పెరిగిందన్నారు.లోకో షెడ్ నిర్వహణ రికార్డులను తనిఖీ చేసి, అందులో నమోదైన ప్రమాణాలను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బందితో మాట్లాడి వాస్తవంగా అమలు చేస్తున్న నిర్వహణ విధానాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వీటి విధి నిర్వహణలోఎదురవుతున్న సమస్యల పై సిబ్బం ది అభిప్రాయాలను తపన్ కుమార్ సిన్హాతెలుసుకున్నారు. షెడ్ సిబ్బంది చేస్తున్ కృషి, పనితీరును గుర్తిస్తూ ఆయన నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈతనిఖీ ద్వారా నాణ్యమైన నిర్వహణ, భద్రత, జవాబుదారీతనం, వనరులవినియోగం, నిరంతర అభివృద్ధి వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టేలా సిబ్బంది పనిచేయాలని చెప్పారు. దీంతోపాటుమెటీరియల్ మేనేజ్‌మెంట్, పరిశుభ్రత, స్క్రాప్ తొలగింపు, పని చేసే ప్రదేశంలో భద్రత వంటి అంశాలను కూడా పరిశీలించారు. ఈ తనిఖీల్లో పలువురు రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు మిర్చి యార్డుకు మెగా ప్లాన్

- 108 ఎకరాల విస్తరణకు అడుగులు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం
- స్థలాల అన్వేషణ కూడా జరుగుతోంది
- సానుకూల స్పందన వస్తే వెంటనే విస్తరణ చర్యలు: చైర్మన్ కుర అప్పారావు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆసియాలోనే అతిపెద్ద మిర్చి మార్కెట్‌గా గుర్తింపు పొందిన గుంటూరు మిర్చియార్డును దేశానికే మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దే దిశగా మెగా విస్తరణకు అడుగులు పడుతున్నాయి. రైతులు, వ్యాపారుల పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని యార్డును సుమారు 108 ఎకరాల్లో విస్తరించేందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ కుర అప్పారావు తెలిపారు. విస్తరణకు అవసరమైన స్థలాల అన్వేషణ కూడా జరుగుతోందని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభిస్తే తదుపరి చర్యలు తీసుకుని విస్తరణ పనులను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. మిర్చి మార్కెట్ విస్తరణతో పాటు కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

రైతులకు మెరుగైన మార్కెటింగ్

గుంటూరు మిర్చి యార్డుకు పల్నాడు, గుంటూరు, ప్రకాశం, కర్నూలు సహా పలు జిల్లాల నుంచి భారీగా మిర్చి పంట వస్తోంది. సీజన్‌లో పెరుగుతున్న రద్దీ కారణంగా వాహనాల రాకపోకలు, మిర్చి బస్తాల నిల్వ, వేలం, కొనుగోళ్ల సమయంలో స్థలాభావం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విశాలమైన ప్రాంగణాలు, నిల్వ సదుపాయాలు, పార్కింగ్, తూకం కేంద్రాలు, మెరుగైన రవాణా వసతులు కల్పించడమే విస్తరణ ప్రధాన లక్ష్యమని తెలుస్తోంది. 108 ఎకరాల విస్తరణ కార్యరూపం దాల్చితే రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు, వ్యాపారులకు విశాలమైన వ్యాపార వేదిక, ఎగుమతిదారులకు మరింత అనుకూలమైన మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. మిర్చితో పాటు కూరగాయల మార్కెట్ ఏర్పాటైతే గుంటూరు వ్యవసాయ ఉత్పత్తుల సమగ్ర మార్కెటింగ్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

పెద్దల సభలో వైసీపీ ప్రవర్తన సిగ్గు చేటు

మండలి ప్రాముఖ్యత, బాధ్యతలు తెలుసుకోవాలి

శాసనమండలి సభ్యుడు వర్ల రామయ్య

అమరావతి, ఆంధ్రప్రభ : శాసన మండలిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వ్యవహరించిన తీరు తనను తీవ్రంగా బాధించిందని నూతనంగా ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్సీ వర్ల రామయ్య అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దల సభగా పిలిచే శాసన మండలిలో చర్చలు, సమీక్షలు, బిల్లులపై సూచనలు చేయాల్సి ఉండగా.. నినాదాలు, అరుపులు, ప్లకార్డులు, గందరగోళంతో సభా కార్యకలాపాలను అడ్డుకోవడం సరికాదన్నారు. తాను ఎమ్మెల్సీగా తొలి రోజు శాసన మండలిలో అడుగుపెట్టినప్పుడు సభలో పెద్ద ఎత్తున గందరగోళం కనిపించిందని రామయ్య చెప్పారు. మెగా డిఎస్సీ చర్చకు రావాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బహిరంగ సవాల్ విసిరినా స్వీకరించకుండా శాసనమండలిని వేదికగా చేసుకుని గందరగోళం చేయటం వైసీపీకి తగదన్నారు.

వైద్య ఉత్పత్తుల పేరుతో ఘరానా మోసం

- పంపిణీదారుకి రూ.85 లక్షల టోకరా!
- షాలెక్స్ మెడిటెక్ కంపెనీలో 40 శాతం వాటా ఇస్తామంటూ బురిడీ
- రూ. 25 కోట్ల ప్రాజెక్టు పేరిట ఎంవోయూ
- నిధులు వ్యక్తిగత అవసరాలకు మళ్లింపు
- ముగ్గురు నిందితులపై విశాఖ త్రీటౌన్‌లో కేసు నమోదు

ఎంవీపీకాలనీ-(విశాఖపట్నం), ఆంధ్రప్రభ: విశాఖలో పెట్టుబడుల పేరుతో అమాయకులను, బడా వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని బోల్తా కొట్టించే ఘరానా మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రముఖ మెడికల్ టెక్నాలజీ జోన్ (మెడిటెక్ జోన్) ప్రాంగణాన్ని అడ్డం పెట్టుకుని, భారీ ఎత్తున లాభాలు తెచ్చిపెట్టే సరికొత్త పరిశ్రమను స్థాపిస్తున్నామంటూ ఓ ప్రముఖ హోల్‌సేల్ వస్త్రవ్యాపారంలో సుదీర్ఘ అనుభవం గడించిన పరాస్ బంథియాను లక్ష్యంగా చేసుకుని కొందరు కేటుగాళ్లు అత్యంత పక్కా పథకం ప్రకారం వల విసిరారు. మెడిటెక్ జోన్ కేంద్రంగా వైద్య రంగానికి అత్యవసరమైన అత్యాధునిక పరికరాలు, నాణ్యమైన సర్జికల్ వస్త్రాలు తయారుచేసే సరికొత్త కంపెనీని స్థాపిస్తున్నామని నమ్మబలికారు. వైద్య రంగంలో నూతన అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఇందులో పెట్టుబడి పెడితే అతి తక్కువ సమయంలోనే ఊహించని రీతిలో లాభాల పంట పండుతుందని ఆశచూపారు. ఈ క్రమంలో వ్యాపారిని పూరిగా బుట్టలో వేసుకుని నిధులు కాజేసిన వ్యవహారంపై బాధితుడు విశాఖ మూడవ పట్టణ పోలీసులను ఆశ్రయించడంతో ఈ భారీ స్కామ్ వెలుగులోకి వచ్చింది.

పోలీసులు వెల్లడించిన ప్రాథమిక వివరాల ప్రకారం విశాఖ మెడిటెక్ జోన్‌లో వైద్య పరికరాలు, ప్రత్యేక రక్షణ వస్త్రాలను తయారు చేసే షాలెక్స్ మెడిటెక్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంజీవ్, ఆ సంస్థ వ్యవస్థాపక సభ్యురాలైన తులసి, మరో కీలక కార్యనిర్వాహకుడు గుర్జీత్లు ఒక వ్యవస్థీకృత ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా 2025 మార్చి నెలలో పరాస్ బంథియా వద్దకు వెళ్లి తమ సరికొత్త వ్యాపార ఆలోచనలను వివరించారు.ప్రస్తుత మార్కెట్‌లో మెడికల్ సర్జికల్ వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో భారీ డిమాండ్ ఉందని, తాము ప్రారంభించే ఈ కొత్త ప్లాంట్‌లో భాగస్వామి అయితే విస్తృత లాభాలు గడించవచ్చని చెప్పారు. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.25 కోట్లు అవుతుందని, ఇందులో బంథియా ప్రధాన పెట్టుబడిదారుడిగా చేరితే కంపెనీలో ఏకంగా 40 శాతం కీలక వాటాను కల్పిస్తామని నమ్మబలికారు.

బాధితుడికి ఎలాంటి అనుమానం రాకుండా ఉండేందుకు షాలెక్స్ మెడిటెక్ సంస్థ తరపున లీగల్ నిబంధనలతో కూడిన ఒక అధికారిక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కూడా కుదుర్చుకుని మోసపూరిత నాటకానికి పక్కా స్కెచ్ వేశారు.నిందితులు కుదుర్చుకున్న ఎంవోయూ పత్రాలను, వారి మాటలను గుడ్డిగా విశ్వసించిన పరాస్ బంథియా విడతల వారీగా తన కష్టార్జితాన్ని వారి చేతుల్లో పెట్టారు. ఫ్యాక్టరీ లైసెన్సులు, మౌలిక వసతులు, యంత్రాల కొనుగోలు పేరుతో నిందితులు ఒత్తిడి తేవడంతో బాధితుడు తన వ్యక్తిగత, వ్యాపార బ్యాంకు ఖాతాల ద్వారా దాదాపు రూ. 85 లక్షల వరకు నగదును వారి ఖాతాలకు నేరుగా బదిలీ చేశారు. ఒప్పందం జరిగి ఏడాది గడుస్తున్నా కంపెనీ పనుల్లో ఎలాంటి కదలిక లేకపోవడంతో బాధితుడికి అను మానం వచ్చింది.

నిందితులను నిలదీయగా వారు రోజుకో సాకు చెబుతూ తప్పించుకుసాగారు. దీనిపై బంథియా లోతుగా ఆరా తీయగా, తాను పరిశ్రమ కోసం ఇచ్చిన పెట్టుబడి నిధులను నిందితులు సొంత విలాసాలు, వ్యక్తిగత అవసరాల కోసం దారిమళ్లించి విచ్చలవిడిగా ఖర్చు చేసినట్లు నిర్ధారణ కావడంతో బాధితుడు లబోదిబోమన్నారు. అయితే నిందితుల నుంచి ఎలాంటి స్పందన రాకపోగా నిర్లక్ష్యంగా సమా ధానం ఇవ్వడంతో ఆయన మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఆధారాలతో సహా లిఖితపూర్వ కంగా ఫిర్యాదు అందజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు షాలెక్స్ మెడిటెక్ సంస్థ నిర్వాహకులు సంజీవ్, తులసి, గుర్జీత్లపై చీటింగ్, నేరపూరిత కేసు నమోదు చేశారు.

భోగాపురానికి విద్యుత్ బస్సుల పరుగులు



- విశాఖ నుంచి ప్రతి అరగంటకో బస్సు
- బస్సుల రాకపోకలు, చార్జింగ్ కేంద్రాల పరిశీలన
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

విశాఖపట్నం, ఆంధ్రప్రభ: అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికుల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు ఆర్టీసీ విద్యుత్ బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చిందని, విశాఖపట్నం నుంచి ప్రతి అరగంటకు ఒక ఎలక్ట్రిక్ బస్సు అందుబాటులో ఉంచినట్లు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏఎస్ఆర్ అంతర్జాతీయ విమా నాశ్రయానికి చేరుకున్న ఆయన అక్కడ ఏర్పాటు చేసిన బస్‌స్టాండ్, విద్యుత్ వాహనాల చార్జింగ్ కేంద్రా న్ని పరిశీలించారు. విమానాశ్రయానికి వచ్చే ప్రయా ణికులకు అందుతున్న రవాణా సదుపాయాలు, బస్సుల రాకపోకలు, బస్‌స్టాండ్‌లో ఉన్న వసతులపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రయాణికులతో స్వయంగా మాట్లాడి విశాఖ నుంచి విమానాశ్రయానికి ఆర్టీసీ అందిస్తున్న సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విమానాశ్రయానికి ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి అరగంటకు ఒక ఎలక్ట్రిక్ బస్సును నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు మంత్రికి వివరిం చారు.

విమానాల రాకపోకలకు అనుగుణంగా బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. విమాన ప్రయాణికులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన రవాణా అందించడమే లక్ష్యంగా ఆర్టీసీ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. విమానాశ్రయంలో ప్రయాణికులకు అవసర మైన మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. విశాఖ నుంచి విమానాశ్రయానికి విద్యుత్ బస్సుల సర్వీసులు అందుబాటులోకి రావడంతో ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుందన్నారు.

రైతు చేతిలో నైపుణ్యాస్త్రం

- అంగ్రూలో ఆన్‌లైన్ సర్టిఫికేట్ కోర్సులు
- రైతులు, యువతకు శిక్షణ.. ఆదాయం పెంచే కోర్సులకు శ్రీకారం

అమరావతి, ఆంధ్రప్రభ: చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు గ్రామీణ యువత, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (అంగ్రూ) వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. లాం ఫారంలోని సార్వత్రిక, దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకం, చిరుధాన్యాల ఉత్పత్తి, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ అంశాలపై సెప్టెంబర్ నుంచి ఆన్‌లైన్ సర్టిఫికేట్ కోర్సులను ప్రారంభించనుంది. ప్రతి కోర్సు ఎనిమిది వారాలు (రెండు నెలలు) కొనసాగుతుంది. ఆన్‌లైన్ తరగతులతో పాటు ప్రాక్టికల్ శిక్షణ కూడా అందించనున్నారు. ప్రయోగాత్మక తరగతులను నిర్దిష్ట స్టడీ సెంటర్లలో ఒకరోజు నిర్వహిస్తారు. రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు అందించి చిన్న తరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడమే ఈ కోర్సుల ప్రధాన లక్ష్యమని విశ్వవిద్యాలయం తెలిపింది. ఎనిమిదేళ్లలో అంగ్రూ దూరవిద్యా కేంద్రం నిర్వహించిన వివిధ సర్టిఫికేట్ కోర్సుల ద్వారా సుమారు 5,400 మంది రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు శిక్షణ పొందినట్లు వెల్లడించింది. ఆసక్తి గల వారు ఒక్కో కోర్సుకు రూ.1,500 ఫీజు చెల్లించి నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ తరగతులకు కంప్యూటర్, ఆండ్రాయిడ్ మొబైల్ లేదా ట్యాబ్ సౌకర్యం అవసరం. సెప్టెంబర్ 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని అంగ్రూ సూచించింది. కోర్సులపూర్తి వివరాలు విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపింది.

రైల్వే స్టేషన్లలో వసతుల 'లేమి'

- విజయవాడ, తిరుపతి, గుంటూరు, విశాఖ సహా పలు చోట్ల కొరతలు
- 512 స్టేషన్లలో 458 చోట్ల కనీస సౌకర్యాలు కరవు
- విశాఖలో పనిచేయని బయో టాయిలెట్లు
- సీఏజీ ఆడిట్‌లో వెలుగులోకి

అమరావతి, ఆంధ్రప్రభ : రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని రైల్వేశాఖ చెబుతున్నప్పటికీక్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సీఏజీ) నివేదిక స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తిరుపతి, గుంటూరు, గుంతకల్, విశాఖపట్నం, విజయనగరం వంటి ప్రధానస్టేషన్ల లోనే కనీస ప్రయాణికులసౌకర్యాల్లో లోపాలు ఉన్నట్లు తేల్చిం ది. తాగునీటి ట్యాపులు, వాటర్ కూలర్లు, ఫ్యాన్లు, ప్లాట్‌ఫాం షెల్టర్లు, మరుగుదొడ్లు, యూరి నల్స్, సైన్‌బోర్డులు, పార్కింగ్ తదితర సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని పేర్కొంది. ఈ మేరకు నాన్-సబర్బన్ రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యాలు, పారిశుద్ధంపై సీఏజీ రూపొందించిన నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టారు.

అమృత్ భారత్ స్టేషన్‌లోనూ లోపే

విజయవాడ రైల్వే స్టేషన్‌ను ఎన్ఎస్జీ-2ఏ1 కేటగిరీలో చేర్చడంతో పాటు అమృత్ భారత్ స్టేషన్లలో ఒకటిగా అభివృద్ధి చేస్తున్నారు. అయినా అక్కడ ఫ్యాన్లు, సైన్‌బోర్డుల విషయంలో లోపాలను సీఏజీ గుర్తించింది. ప్రధాన రైల్వే స్టేషన్‌లోనే కనీస సౌకర్యాలు కొరవడటం గమనార్హం. దేశవ్యాప్తంగా అత్యంత రద్దీగా ఉండే పుణ్యక్షేత్ర నగరాల్లో ఒకటైన తిరుపతి రైల్వేస్టేషన్ కూడా ఎన్ఎస్జీ-2ఏ1 కేటగిరీలో ఉంది. అమృత్ భారత్ పథకంలో భాగంగా అభివృద్ధి చేస్తున్నప్పటికీ తాగునీటి ట్యాపులు, ప్లాట్‌ఫాం షెల్టర్లు, వాటర్ కూలర్లు, పార్కింగ్-కమ్ సర్క్యులేటరీ ప్రాంతం విషయంలో లోపాలున్నట్లు ఆడిట్‌లో తేలింది.

గుంటూరు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన యూరినల్స్, సైన్‌బోర్డులు తగిన స్థాయిలో లేవని సీఏజీ పేర్కొంది. మరో ముఖ్యమైన స్టేషన్ గుంతకల్‌లో తాగునీటి ట్యాపులు, వాటర్ కూలర్లు కొరవడినట్లు గుర్తించింది. కావలి రైల్వే స్టేషన్‌లో ప్లాస్టిక్ బాటిళ్లను క్రష్ చేసే యంత్రం ఏడాదికి పైగా పనిచేయకుండా ఉన్నా దాని నిర్వహణపై